క్లుప్తంగా

నేడు శిరివెళ్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

శిరివెళ్ల: ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. గ్రామ 4వ సచివాలయ పరిధిలోని 16వ వార్డులో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పర్యటించి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి, సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా పాల్గొనాలని కోరారు.

గృహ సారథులకు వర్క్‌షాప్..

ఈ నెల 6వ తేదీన మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు స్థానిక షాదీఖానాలో మధ్యాహ్నం 3 గంటలకు వర్క్‌షాప్ జరుగుతుందని వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

వేతనాలు చెల్లించాలి

నంద్యాల(వ్యవసాయం): ఉపాధ్యాయులకు ప్రతి నెల తొలిరోజే వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజాంబేగ్, మౌలాలి కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వేతనాలు సకాలంలో అందక ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారన్నారు. వారికి రావాల్సిన పీఎఫ్, జీవిత బీమా, తుది చెల్లింపులు రెండు సంవత్సరాలు గడుస్తున్నా చెల్లించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, సుంకన్న, దేవేందర్‌రెడ్డి, నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ

- నలుగురికి గాయాలు

రుద్రవరం: మండలంలోని బీ.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. బీ.నాగిరెడ్డిపల్లెకు చెందిన శ్రీరాములు, త్రినేషు అనే ఇద్దరు పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నారు. ఇదే సమయంలో ఎల్లావత్తులకు చెందిన ప్రతాప్,సూర్య అనే ఇద్దరు రుద్రవరం వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. బీ.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తు రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ.కొన్నాయి. దీంతో నాగిరెడ్డిపల్లె వాసులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎల్లావత్తుల వాసులు స్వల్పంగా గాయపడ్డారు.

ఘనంగా చౌడేశ్వరిదేవికి సహస్రదీపాలంకరణ సేవ

బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో కొలువైన అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవ ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి సహస్రదీపాలంకరణ సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం రామేశ్వరం నుంచి తెచ్చిన శివలింగం, 50 కలశాలకు మహన్యాస రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బళ్లాని వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో పురోహితులు మురళి ప్రత్యేక పూజలు, విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరము ప్రసాద వితరణ, రామేశ్వరం నుంచి తెచ్చిన 22 బావుల జలాల వితరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మార్చిలో విద్యుత్ సర్కిల్ డే

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ కర్నూలు సర్కిల్ డే వేడుకలను మార్చిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు సర్కిల్ కార్యాలయం, కర్నూలు, ఆదోని, నంద్యాల డివిజన్ల టీమ్‌ల వారీగా క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు.

అలరించిన ఆ పాత మధుర గీతాలు



పాటలు పాడుతున్న కళాకారులు

కర్నూలు(హాస్పిటల్): ఘంటసాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో ఆర్కెస్ట్రా కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆ పాత మధురాలు అలరించాయి. కార్యక్రమాన్ని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ ప్రారంభించారు. అనంతరం పాత సినిమాలతో పాటు కొత్త సినిమాల్లోని పాటలను ఇబ్రహీం, హబీబ్, శివప్రసాద్, సంతోషి, రాగిని బృందం ఆలపించి అందరినీ ఆకట్టుకుంది.

వలస వచ్చి.. ఇనుము కాల్చి..

- మధ్యప్రదేశ్ నుంచి నంద్యాలకు..
- వ్యవసాయ పనిముట్ల తయారీతో జీవనం
- ఏడాదికి ఆరు నెలలు ఇతర ప్రాంతాల్లోనే
- కుటుంబంతో కలిసి వస్తున్న వైనం

ఆధునిక కాలంలోనూ..
చేతివృత్తిపైనే నమ్మకం..
అనాదిగా అదే జీవనాధారం..
వ్యవసాయ పనిముట్ల తయారీలో ఇనుమును కరిగించేందుకు చిందుతున్న స్వేదం..
పరికరం తయారీ చేయడం కన్నా..
వాటిని అమ్మడమే కష్టం..
స్థానికంగా ఉపాధి లేక..
పొట్ట చేతబట్టుకొని వందల మైళ్లు వలస..
బహిరంగ స్థలాల్లో చిన్నపాటి పట్టా మాటున, వాతావరణ పరిస్థితులకు ఎదురొడ్డి జీవనం..
తమ భవిష్యత్ తరాలు చదువుకు దూరమవుతున్నా.. కూటి కోసం తప్పని అవస్థ..
ఏడాదిలో ఆరు నెలల పాటు ఇతర ప్రాంతాల్లో జీవన పోరాటం.. మిగిలిన సొమ్ముతో స్వ స్థలానికి పయనం..
తమ ప్రాంతంలో ఉపాధి కరువై నంద్యాలకు వలస వచ్చిన మధ్యప్రదేశ్ వాసుల ఇబ్బందులపై కథనం.



వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్న భోపాల్ వాసులు

గోస్పాడు: మధ్యప్రదేశ్ నుంచి పదుల సంఖ్యలో కుటుంబాలు నంద్యాల పట్టణ పరిసరాల్లో ఇనుమును కొలిమిలో కరిగించి వ్యవసాయ పనిముట్ల తయారీ చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. 20 రోజుల క్రితం వారు నూనెపల్లె సమీపంలో కొన్ని కుటుంబాలు రోడ్డు పక్కనున్న ఖాళీ స్థలంలో పట్టాలతో గుడారాలు వేసుకొని తెల్లవారక ముందు నుంచే ఇనుము కరిగించే పనుల్లో నిమగ్నమవుతారు. మరికొందరు చేసిన పనిముట్లను తీసుకొని విక్రయించడానికి పట్టణంతో పాటు గ్రామాలకు వెళ్తారు. ఇలా వలస వచ్చే క్రమంలో తమ పిల్లలు విద్య దూరమవుతున్నారని బాధిస్తున్నా.. ముందు తాము కడుపు నింపుకోగలిగితే చాలనే ఇలా వారిని కూడా వెంట తీసుకొస్తామని ఆర్ద్ర హృదయాలతో చెబుతున్నారు. ఏటా ఇదే సమయంలో ఇక్కడి వస్తామని, ఇక్కడ వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత తమ ప్రాంతానికి వెళ్లిపోతామంటున్నారు. పరికరాలు చేయడం కన్నా వాటిని విక్రయించడానికి అధికంగా శ్రమిస్తున్నామని, ఒక్కో రోజు ఒక్క పనిముట్టు కూడా అమ్ముడుపోదని, ఆ రోజు తమ బాధ వర్ణనాతీతమంటున్నారు. తాము తయారు చేసిన కొడవలి రూ.100 – రూ.150, గొడ్డళ్లు రూ.200 – రూ.350, మాంసం కత్తి రూ.150 – రూ.250 వరకు ఇలా వివిధ పనిముట్లను అమ్ముతున్నారు. అయితే రోజంతా పని చేసినా ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.500 కూలి కూడా లభించడం టున్నారు. తమ ప్రాంతంలో పరికరాలకు అంతగా గిరాకీ లేదని, దీంతో ఇంత దూరం వలస వస్తున్నామంటున్నారు. లారీ, ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు చెందిన పనికిరాని ఇనుప పట్టాలను కిలోల ప్రకారం కొనుగోలు చేసి వాటిని కొలిమిలో కరిగించి కోత చేసే కొడవళ్లు, గొడ్డళ్లు, వ్యవసాయ పరికరాలు పారలు, గుణపాలు, వంటకు సంబంధించిన కత్తిపీటలు, మాంసం కత్తులు తయారు చేస్తున్నారు.



తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు



ఈ పట్టల గుడారాలే వారి ఆవాసాలు

రోజంతా కష్టపడినా పూట గడవటం కష్టం



వ్యవసాయ పనిముట్లు తయారీలో చిన్నప్పటి నుంచి పని చేస్తున్నా. మా ప్రాంతంలో పనిముట్లు కష్టపడి తయారు చేసినా వాటికి సరైన గిరాకీ ఉండటం లేదు. బతుకు దెరువు కోసం ఇలా వలస వస్తున్నాం. రోజంతా శ్రమించినా కష్టానికి తగ్గ ఫలితం అందడం లేదు. పిల్ల పాపలతో కుటుంబం అంతా కలిసి వస్తున్నాం. రోజంతా కష్టపడినా పూట గడవటం లేదు. అయినా తప్పదు కదా.

–సంతోష్, భోపాల్

పనిముట్ల తయారే జీవనాధారం



వందల కిలోమీటర్లు వలస వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నాం. పూర్వీకుల నుంచి చేతి వృత్తి పైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నాం. వ్యవసాయ సీజన్‌లో ఇక్కడికి వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముతాం. రెక్కలు ముక్కలు అయ్యేలా ఎండనకా, గాల నకా కష్టపడిన కనిపించని శ్రమ వాటిని విక్రయించేందుకు శ్రమించాల్సి వస్తోంది. కుటుంబమంతా కష్టపడినా కూలి గిట్టుబాటు కావడం లేదు. అరకొరగా మిగిలిన సొమ్ముతో సొంత ప్రాంతానికి వెళ్లిపోతాం. – సుగుణాబాయి, భోపాల్



గోవిందపల్లెలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుర్తుకొస్తున్నాయి..

- ఉల్లాసంగా..పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

శిరివెళ్ల: అందరూ కలిసి మెలిసి ఒక చోట చదువుకున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. ఆదివారం గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలచెందిన 1983–84 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు 39 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో తమకు విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులు వేమారెడ్డి, శివారెడ్డి, ఈశ్వరరెడ్డి, బాలిరెడ్డి, రాజు, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. అంతకు ముందు మరణించిన తమ సహాధ్యాయులకు నివాళులర్పించారు. చదివిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తీర్మాణం చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, ఎస్ఎచ్ భాస్కరెడ్డి, వెంకటరెడ్డి, వెంకట రమణారెడ్డి, గాలి రెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'మేడం.. సీ' పుస్తకావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, ఆర్థర్, ప్రముఖులు

నంద్యాల(వ్యవసాయం): ప్రముఖ పుస్తక రచయిత, వార్తా రచనల్లో అందవేసిన చేయిగా పేరు పొందిన కాశీపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన మేడం సీ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో ఎమ్మెల్యేలు శిల్పాచక్రపాణిరెడ్డి, తొగూరు ఆర్థర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి సాహితీ స్పర్శ వారసత్వంగానే లభించిందని, తనలో ఉన్న సాహితీ పిపాస ఆయనను నిద్రపోనివ్వలేదని, తనదైన ప్రతి అనుభవం ముఖ పుస్తకంలో పేజీ నింపేదని కొనియాడారు. రచయిత కాశీపురం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ సంస్కృతిపై నెలకొన్న అపోహలను తొలగిస్తూ క్రికెట్ క్రీడ కేంద్రీకృతంగా ఒక యువతి చేసిన సాహసోపేత ప్రయాణమే తాను రాసిన మేడం సీ నవల అని చెప్పారు. వంద పుస్తకాలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కొనుగోలు చేసి ప్రముఖులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ భూమన కుసుమ కుమారి, రాయలసీమ అధ్యయన వేదిక అధ్యక్షుడు భూమన్, ప్రఖ్యాత రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ సహదేవుడు, రాకేష్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠ

వెలుగోడు: పట్టణంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆళ్వారుల విగ్రహాల ప్రతిష్ఠ కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం దేవస్థానానికి సంబంధించిన ధర్మకర్తలు, ముదుంబై వంశస్తులు వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది పాల్గొని 12 అళ్వారుల విగ్రహాల ప్రతిష్ఠ, శాంతి కల్యాణం పూజలను పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముదుంబై వంశస్తుడు రిటైర్డ్ డీఎల్‌పీఓ మధుసూదన శర్మ తదితరులు పాల్గొన్నారు.



అళ్వారుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న దృశ్యం



కొండాపరం–భాగ్యనగరం మధ్య వరి పొలాల్లో మేస్తున్న బాతులు

చిత్తూరు నుంచి వచ్చామండీ..

దొర్నిపాడు: మండలం బాతులకు ఆహార నిలయంగా మారింది. చిత్తూరు జిల్లా నుంచి ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో బాతు పెంపకందారులు ఇక్కడి వాటితో వలస వస్తున్నారు. కేసీ కెనాల్ పరిధిలోని కొండాపురం, భాగ్యనగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, దొర్నిపాడు, అర్జునాపురం గ్రామాల్లోని వరి పొలాలు, పంట కాల్వల్లో వాటికి మంచిగా ఆహారం దొరుకుంది. అలాగే ఇక్కడ బాతులు గుడ్లు పెడుతుండంతో అన్నిటినీ సేకరించి చిత్తూరుకు ఎగుమతి చేస్తారు. ఒక్కో గుడ్డు ధర రూ.8 ఉంటుందని పెంపకందారులు పేర్కొంటున్నారు. సుమారు 2వేల బాతులతో ఇక్కడికి వచ్చామని, మూడు నెలలపాటు ఇక్కడ మేత దొరుకుతుందని చెబుతున్నారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవం



ఆలమూరులో ప్రతిష్ఠించిన శ్రీ మద్విరాట్ వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహం

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో శ్రీ మద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ముగిశాయి. కొద్ది రోజులుగా గ్రామంలోని మఠం వద్ద ఆలయ నిర్వాహకులు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. పనులు పూర్తి కావడంతో ప్రతిష్ఠోత్సవం వేడుకలు జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా మఠంలో వివిధ రకాల పూజలు చేసి చివరి రోజు పండితుల వేదమంత్రోచ్ఛారణలతో స్వామి విగ్రహ ప్రతిష్ఠ గావించారు. స్థానికులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు చేశారు.

25న వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆళ్లగడ్డ: లోకకల్యాణార్థం ఈనెల 25న చాగలమర్రి పట్టణంలోని వాసవీ డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వీరభద్రుడు, నరసింహశాస్త్రి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలంలోని శెట్టివీడు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో రూ.10 లక్షలతో నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహాలను ఆదివారం వేడకగా ప్రతిష్ఠించారు. శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ పర్యవేక్షణలో ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. శంకరానంద ఆధ్వర్యంలో ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, జిల్లా బాలవికాస్ కన్వీనర్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు విశేష పూజలు

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని పుట్టాలమ్మను దర్శించుకున్నారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి, శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. పాలు, పండ్లు, చీరలు, బియ్యం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జంబులా పరిమేశ్వరికి ప్రత్యేక పూజలు



రుద్రవరం: మండల కేంద్రం సమీపంలోని జంబులా పరమేశ్వరీ దేవికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి సందర్భంగా గ్రామంలోని ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని మేళ తాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు చేసి, హారతులు పట్టారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

లోక కల్యాణం కోసం హోమాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డులోని స్ఫటిక లింగేశ్వర ఆలయంలో మాఘ మాస పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం లింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించి పుణ్యాహుతి గావించారు. పాములేటి స్వామి కుమారుడు యోగానంద మాట్లాడుతూ తాను కూడా తన తండ్రి బాటలోనే ప్రతి పౌర్ణమి రోజు లోక కల్యాణం కోసం హోమాలు చేపడతానని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తిమ్మయ్య, గాంధీ, నాగేశ్వరరావు, పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



హోమ గుండానికి పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పిస్తున్న దృశ్యం



రంగురంగుల విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న మహా"నంది"

మహా"నంది"కి మెరుపులు

మహానంది: నల్లమల అడవుల్లో వెలిసిన మహానంది మహానందానికి నిలయం. పచ్చటి చెట్లు, పక్షుల కిలకిలరావాలతో ఆలయ పరిసరాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంటాయి. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ. 2 కోట్ల సొంత నిధులతో చేపట్టిన సుందరీకరణ పనుల్లో భాగంగా రాతి నంది విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పచ్చదనం, అధునాతనమైన లైటింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



మహానందిలో ఆకట్టుకుంటున్న రాతి నంది విగ్రహం

సిద్ధవటంలో మల్లన్న కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలానికి దక్షిణద్వారమైన వైఎస్సార్ జిల్లాలోని జ్యోతిసిద్ధవట క్షేత్రంలో శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కంటే ముందుగా అక్కడ కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయిగా వస్తోంది. ఇందులో భాగంగా జ్యోతి సిద్ధేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, కామాక్షిదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, రుద్రహోమం జరిపించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలదేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ లవన్న, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

భ్రామరికి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఈ పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. లక్ష కుంకుమార్చన పూజలో భాగంగా అర్చకులు, వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు.



లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

వైభవంగా సీతారాముల కల్యాణం

డోన్ : స్థానిక తిరుమల వీరాంజనేయస్వామి కొండపై మాణిక్యప్రభు సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సీతారామచంద్రస్వాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైఎస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ పర్యవేక్షణలో 108 జంటలు, భక్తుల సమక్షంలో వేద మంత్రాలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మణకుమార్ నిర్వహించారు. అంతకుముందు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణాంజనేయులు గౌడ్, మాణిక్యప్రభు సేవాసమితి అధ్యక్షుడు కొట్రికె సురేష్, కార్యదర్శి మాకం ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మురారి నరసింహయ్య, మాధవరెడ్డి, సహాయ కార్యదర్శులు జక్కా మధుసూధన్, గోవిందరెడ్డి, సమన్వయకర్తలు కిషన్‌సింగ్, మీసేవా శ్రీరాములు, కమిటీ సభ్యులు శేషన్నగౌడ్, ఒంటెద్దుబండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం